# బాబోయ్ ఆదివారం

బి. సునీత

"ఎల్లలూ! తొందరగా లేవండి. సూర్యుడు కూడా వచ్చాడు. ఇంకా ఏంటా మొద్దు నిద్రలు. ఇవాళయినా మీ బట్టలు మీరు ఉతుక్కుంటారా లేదా? ఎప్పుడడిగినా' ఆదివారం రానీ మమ్మీ ఉతుక్కుంటాం! అంటారుగా- చూస్తాను ఎవరు ఎంత మాత్రం మాటనిలబెట్టుకుంటారో! రోజూ నేను మీ బట్టలన్నీ వాష్ చేస్తుంటే తెలీట్లేదు ఎవరికీ. లేవండి!" అంటూ అరిచింది సంధ్య కాఫీ త్రాగుతూ.

మెల్లిగా కదిలాయి మంచాల మీది మూడు ఆకారాలు.

మెల్లిగా కళ్ళు విప్పింది శాంతి అంతే, ఆ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయాయి.

"నా పక్కలోకి రమ ఎలా వచ్చింది రాత్రి పడుకోవటం నేను ఒక్కదాన్నే పడుకున్నానే" అనుకుంటూ మంచం దిగింది.

"అబ్బ ఇవాళ లేవడంతోనే ఒక ప్రాబ్లెమ్ మొదలయింది."

మిగతా రెండు ఆకారాలు ముసుగులు తొలగించి లేచాయి.

"ఏయ్ రమా! ఏంటీ! నీవు నా టంగ్ క్లీనర్‌తో నాలుక గీస్తున్నావు."

"ఇది నీదా! భలేదానివే! రోజూ నేను దీంతో నాలుక గీస్తుంటే."

"అవును ఉమా! అది రమదే. దాంతోనే అది రోజూ నాలుక గీస్తోంది."

"అయితే నీవు రోజూ నా టంగ్ క్లీనర్ ఉపయోగిస్తున్నావన్నమాట" ఉరిమింది ఉమ రమని చూసి.

"అబ్బబ్బ అందరూ ఆ దొడ్లోజేరి ఏంటి గొడవ. అందరూ ఒకసారేలేస్తే పెద్ద రగడ ఉమా. ఇవాల్టికి నీవు నాలుక నా టంగ్ క్లీనర్‌తో గీసుకో. రేపు కొందాం. ఇవాళ ఆదివారం కొట్లుండవుగదా. దొడ్లో అల్లరి చేయకండి."

"అందరూ ఎవరి పాటికే వాళ్ళు వాళ్ళిష్టమొచ్చిన టైమ్‌కే లేస్తారు. ఈ లోపల ఎవరి పనులు వాళ్ళు గుట్టు చప్పుడు కాకుండా చేసుకుంటారు. ఇవాళ ఆదివారంగదా! సెలవ రోజు అందర్నీ తొందరగా లెమ్మంటే ఇదీ గొడవ."

"మమ్మీ కాఫీ ఇవ్వవా?"

"రోజూ నేను యిస్తూనే వున్నానుగా! ఇవాళయినా మీరు కలుపుకుని త్రాగండి."

"ఏంటి రమా! నడుంకి చేయిపెట్టి నిలబడతావు. నాకు యిరుగ్గా వుంది దించు"

"అబ్బో! గ్యాస్ మీద ఆ ప్రక్క కాఫీ కలుపుకుంటుంటే నా చేయి అడ్డొచ్చిందే పాపం."

"అబ్బబ్బ మళ్ళీ వంటింట్లో ఏంటి గొడవ. ఏ పనయినా చెప్తే చాలు అక్కడ రణరంగమే. గ్యాస్‌నిండా కాఫీ. పంచదారలు పొయ్యకుండా కలుపుకోండి. చీమలు పడ్తాయి. మళ్ళీ ఆ గ్యాస్ తుడవటానికి నాకు ఓపికలేదు"

"తొందరగా కాఫీలు త్రాగి బట్టలుతకండి. వారం రోజుల నుంచి మీ బట్టలు ఎట్లా పేరుకుపోయినయ్యో."

"రమా! ముందు నీవు బట్టలుతుకుతావా! లేకపోతే నా బట్టలుముందు వుతికేసుకోనా?"

"మళ్ళీ ముగ్గురూ మూడుసార్లెందుకు. ఆ బావిగట్టుమీద ముగ్గురూ ఒకేసారి ఉతికేయండి. మళ్ళీ లేటవుతుంది. చదువుకోపటానికి టైం వుండదు."



"సరే! మమ్మీ చెప్పినట్లు ముగ్గురం ఒకేసారి వుతుకుతేసరి."

"తొందరగా సబ్బు పెట్టు. ఏంటీ?! ఆ సబ్బు మొత్తం నీ లంగాకే సరిపోయేటట్లుంది. మరి నాకో. అసలే నా లంగా మురిగ్గా వుంది."

"అబ్బ ఉండవే గొడవ. ముందు నా లంగా కానీ, తరువాత నీది."

"మళ్ళీ అక్కడ సబ్బుకోసం పోట్లాటా? ఉమా! నీవు సర్ఫ్ పాకెట్ తీసుకెళ్ళు."

"ఏంటీ బాదటం. నా గౌనంతా తడిసింది. మమ్మీ! ఉమ చూడు ఎంత రూడ్‌గా బట్టలు బాదుతోందో! నా గౌనంతా త డి పిం ది" ఏడుస్తూ ఫిర్యాదుచేసింది శాంతి.

"అది బాదుతుంటే నీవు వెనకాల నిలబడ్డం ఎందుకూ? మైండ్ లేకపోతేసరి."

"నా గౌనంతా తడిపింది. దీని తిక్క ఎలా కుదర్చాలంటే" "రమా నాకు కాస్త సబ్బు ఇవ్వవా? నా షిమ్మీ చాలా మురిగ్గా ఉంది" అడిగింది శాంతి

"ఊఁ.... ఈ సగం తీసుకో" అంటూ అట్లకాడతో సబ్బుని సగంచేసింది రమ

సగం సబ్బు మొత్తం షిమ్మీకి పట్టించి చిన్నముక్కని ఆ బావి గట్టుమీద పడేసింది.

"అడ్డం లేవండి. నేను నీళ్ళు తోడుకోవాలి. రమా నీవుకాస్త జరుగు. శాంతీ, ఆ షిమ్మీకి అంత సబ్బు పెట్టావేంటీ!?" అంటూ - అంతే! పెద్దమోతతో బావిగట్టుమీద జర్రున జారింది ఉమ. నడుం బావి గట్టుకి తగిలింది.

"ఎవరే! ఇక్కడ సబ్బు ముక్క పడేసింది. బుద్ధిలేకపోతేసరి. పాకీముం...." అంటూ తనకచ్చ తీర్చుకుంది.

"హా.... హ్హా.... హ్హా" అంటూ పకపకా నవ్వారు రమ, శాంతి.

"లేకపోతే ఏంటి? చూసుకుని నడువక్కర్లే! మంచిపని. అట్లాగే కావాలి. తిక్క కుదిరింది."

"అమ్మా నడుం పట్టేసింది.. నా బట్టలు నువ్వు ఆరెయ్యవా" అంటూ జాలిగా ముఖం పెట్టింది ఉమ

హమ్మయ్య! ఎట్లాగయితేనేం, గంటన్నరకి బట్టలు తాళ్ళమీద ఆరవేశారు.

"సరే స్నానాలు కానీయండి. మీ ముగ్గురూ ముందు అన్నం తిందురుగాని. తరువాత నేను, నాన్న తింటాం. నాన్న బయటికెళ్ళారు. వచ్చేలోపల కానీయండి."

"అమ్మా! నాకు కొంచెం కూరవేయవా? రోజూ అయితే తృప్తిగా తినటానికుండదు. ఇవాళయినా కాస్త తీరిగ్గా తినాలి."

"ఇంకా ఎంత కూర! ఎంత ఆదివారం అయితే మాత్రం. పీకలనిండా తినాలని రూలుందా?"

ఇంతలో వాళ్ళ నాన్న లోపలికొచ్చారు.

బిక్క ముఖం వేసింది ఉమ.

"ఏంటోయ్ గొడవ. వాళ్ళు అడిగినంత వడ్డించు. పిల్లలతో ఏంటి గొడవ. ఆదివారమయినా ప్రశాంతంగా వుండక."

"అయిందా! టేబుల్ తుడవండి. నేను, నాన్న తినాలి."

పిల్లలు తిని హాల్లో కెళ్ళారు.

నెయ్యి కరగబెడుతోంది సంధ్య.

"ఏంటోయ్! ఇంకా ఎంత సేపు, పదకొండయింది. ఇంకా ఆలస్యమా?" అంటూ వెనకగా వచ్చి నడుంమీద చేయి వేశాడు.

"అయిపోయింది. అబ్బ- ఏంటండీ ఇవాళ ఆదివారం గుర్తులేదూ" అంటూ నవ్వింది. ఇంతలో ఎవరో వచ్చినట్లయింది వంటింట్లోకి. అంతే! గాభరాగా చేయి తీశాడు.

"ఏం కావాలి నీవు అన్నం తిన్నావుగా. ఇహ హాల్లో కూర్చుని చదువుకోండి."




"అహ! నాకు మంచినీళ్ళు" మంచి నీళ్ళు త్రాగేసి వాళ్ళద్దర్నీ అనుమానంగా చూసి వెళ్ళింది శాంతి.

"ఇదిగోండి పిల్లలూ! మా భోజనం అయింది కానీ, మీరు మాత్రం హాల్లో చదువుకుంటూ వుండండి. అట్లా మొద్దు నిద్రలు పోయారంటే ఆ హాల్లో ఆ రేడియో. వాచీ ఎవడో గోడమీకి ఎత్తుకుపోతాడు."

ప్రక్క గది తలుపులు మూసుకున్నాయి.

"అబ్బ. నా దుప్పటిమీద నీవు పడుకుంటావే! దుప్పటి వేసింది నీకోసం కాదు లే." అంటూ కసురుకుంది ఉమ.

"అబ్బో ఎంత షాను! బోడి దుప్పటి. నీకేనా! నేను యింకో దుప్పటి తెచ్చుకుంటానే! నీబోడి దుప్పటి ఎవడికి కావాలి."

టక్....టక్....టక్. "మమ్మీ ఒకసారి తలుపు తీయవా! ఉమ. దాని దుప్పటిమీద నన్ను పడుకో నీయట్లేదు. నాకు. శాంతికి ఒక దుప్పటి కావాలి."

అసలు మమ్మీ వస్తోందో. లేదో నని క్రాఫ్‌ని పక్కకి త్రోసుకుని తలుపు సందులోంచి చూస్తోంది శాంతి.

"ఏయ్ తప్పు. అమ్మ తిడుతుంది.ఏంటా చూట్టం."

కిర్రుమని తలుపులు తెరుచుకున్నాయి.

"అబ్బ- కాసేపు నిద్రపోవటానికి ఉండదుకదా! ఏం కావాలి. తొందరగా మీకు కావలిసిన దుప్పట్లు తీసుకుని వెళ్ళండి. అల్లరి చేయకండి. నాన్నకి కోపం వస్తుంది. అల్లరి వినపడిందో. బయటికొచ్చి బాదుతాను ఒక్కొక్కళ్ళని జాగ్రత్త."

"ఏంటి శాంతీ ఇంకా నిలబడే ఉన్నావే- వెళ్ళు."

"ఏంటమ్మా! ప్రతిరోజూ నీవు ఆ గదిలో పడుకుంటూనే ఉన్నావుగదా! ఇవాళ ఆదివారం. ఇవాళ ఒక్కరోజూ హాల్లో పడుకుంటే ఏమ్మా" అంటూ ఆశ్చర్యంగా అడిగింది శాంతి.

"ఎవరా అధిక ప్రసంగం" అంటూ నవ్వుతూ బయటికొచ్చాడు శరత్.

ఒక్కొక్కళ్ళే హాల్లోకి జారుకున్నారు దుప్పట్లతో.

"ఏమండీ! మీరు పడుకోండి. నేను కాసేపు హాల్లో కూర్చుని వస్తాను" అంటూ నవ్వుతూ హాల్లో పిల్లల దగ్గర కొచ్చింది సంధ్య.

ఉసూరుమని తన గదిలో కెళ్ళాడు శరత్.

"మమ్మీ ప్రక్కింటి సుమతి ఆంటీ వచ్చారు" అంటూ కబురు తెచ్చింది శాంతి.

"రండి" అంటూ నవ్వుతూ ఆహ్వానించింది- మనసులో తిట్టుకుంటూ.

"అన్నయ్యగారు నిద్ర పోతున్నారా?" అంటూ ఓ వెకిలినవ్వొకటి విసిరి పిల్లల దుప్పట్లమీద కూర్చుంది.

అసలు సంధ్య పిల్లల దగ్గర ఒక అర గంట వుండి గదిలో కెళదామనుకుంది. అట్లాంటిది ఇప్పుడు ఈవిడ.... ఉసూరుమని నిట్టూర్చింది.

సరిగ్గా నాలుగింటికి లేచిందావిడ.

పిల్లలు జనరంజని ఆన్ చేశారు.

"....ఏంటి ఉమ! అంత పెద్దగానా. నా చెవులు చిల్లులు పడుతున్నాయి. ఇందాకటిదాకా ఆవిడగారు తుప్పు వదిలించింది ఇప్పుడు నీవా" అంటూ అరిచింది రమ.

"అబ్బ ఏంటీ? రేడియో అంత పెద్దగా పెట్టి. మీరూ పెద్దగా అరుచుకుంటున్నారు. ఆ రేడియోనన్నా ఆఫ్ చెయ్యండి. లేదా మీరు నోరన్నా మూసుకోండి. ఆదివారం ఇంట్లో ప్రశాంతత వుండనీయరు. ఆదివారం కూడా బళ్ళు పెట్టి చావకూడదు. నా ప్రాణం తోడేస్తున్నారు." అంటూ విసుక్కుంది సంధ్య.

"ఆదివారం కూడా మమ్మీ రేడియో పెట్ట నీయదు."

"అమ్మా ఆదివారం గదా! టిఫిన్ చేసి పెట్టమ్మా. ఆకలేస్తోంది."

"ఏంటీ ?! టిఫినా! ప్రొద్దుటి నుంచి చేసిన చాకిరీ చాల్లేదనా. ఇంకా టిఫినుట. ఎప్పుడూ నేను చేస్తూనే ఉన్నానుగా! ఇవాళ ఆదివారమేగా. ఇవాళ మీరు చేసిపెట్టండి. నేను. నాన్న తింటాం" అంది ఉక్రోషంగా.

అంతలోనే పాపం చిన్నపిల్లలు అడిగారని పిండి కలిపింది సంధ్య.

హాల్లో శ్రీవారు ఎవరినో "హల్లో" అంటుంటే ఎవరా అని హాల్లో కొచ్చింది.

శ్రీవారి కొలీగ్. ఆయన భార్య. వాళ్ళ పరిచయాలు. శ్రీవారికి. వాళ్ళకీ కాఫీలు అయేసరికి సాయంత్రం ఆరయింది.

ఇహ ఓపిక లేకపోయినా పాపం పిల్లలకి టిఫిన్ చేద్దామని గిన్నె మూత తీసేసరికి గిన్నెలో పిండి జావకారుతున్నట్టుగా వుంది. పూరీలకని తడిపిన పిండిని చేతిలోకితీసుకునేసరికి అది ఒక మీటరు పొడవున సాగేట్లుంది. అప్పుడు తెలిసింది సంధ్యకి ఆ హడావుడిలో పూరీలకి మైదాపిండికి బదులు స్టార్చ్ పౌడర్ వేడినీళ్ళేసి తడిపానని. అయ్యో! ఇప్పుడిదంతా ఎట్లా! ఆఁ రేపొద్దుట వాయిల్ చీరలకీ. స్కూల్ డ్రస్‌లకీ గంజిపెడితే సరి! ఎక్కడలేని నీరసం వచ్చేసింది సంధ్యకి.

"ఏయ్! సంధ్యా ఆరయింది. ఇంకా అలా వున్నావే మనం పిక్చరుకెళదాం అనుకున్నాంగా!"

"పిక్చరూ లేదూ? పిండాకూడూ లేదు. ఇప్పటికే నడుం విరిగింది. ఇంకా సినిమా హాల్లో కూర్చునే ఓపిక నాకు లేదుబాబూ! పెందలాడే చీకటిపడగానే ఇంత తిని. ముందు పడుకుంటేగానీ ఈ నడుంనొప్పి తగ్గేట్టులేదు." అంటూ సోఫాలో కూలబడ్డది.

"అబ్బబ్బ ఆదివారం కాదుకానీ. ప్రాణం తీసేసింది. ఆదివారం వస్తోందంటే ఎన్ని ప్రోగ్రామ్స్ ఫిక్సయేవి. అట్లాంటిది ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్ళయాక ఆదివారం వస్తోందంటే నీరసం వస్తోంది. ఆదివారం కోసం కలలుకనే రోజులు పోయాయి. ఆదివారం వస్తోందంటే భయం. వణుకు. ఇంట్లో పిల్లల యుద్ధకాండ. నిద్రకి కరువు. ఇంట్లో ప్రశాంతత ఉండదు. మళ్ళ ఆరు రోజులకి ఆదివారం వస్తుంది కాబోలు. బాబోయ్."

